ఏడేళ్లుగా మొండి గోడతో దర్శనం

- అసంపూర్తిగా రైతుబజారు నిర్మాణం
- పంట ఉత్పత్తులు విజయవాడ రైతు బజారుకు తరలింపు
- వ్యయ, ప్రయాసలతో రైతుల ఇబ్బందులు
- అధిక ధరలకు బయటి షాపుల్లో కొనుగోలు చేస్తున్న ప్రజలు
- రైతుబజారు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్న స్థానికులు



జి.కొండూరు కమ్యూనిటీ హాల్ ఎదురుగా రైతు బజారు ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో కట్టిన గోడ

జి.కొండూరు: ఒకప్పుడు కూరగాయ పంటలకు పేరుగాంచిన జి.కొండూరు మండలంలో నేడు ప్రత్యామ్నాయ పంటల వైపు ఆ ప్రాంత రైతులు మొగ్గు చూపుతున్నారు. స్థానికంగా రైతు బజారు లేకపోవడడంతో విజయవాడకు తరలించి తక్కువ ధరకు విక్రయించుకోవడం వల్ల రైతులు నష్టపోతున్నారు. రైతు బజారు లేకపోవడంతో వినియోగదారులు సైతం అధిక ధరలకు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. రైతు బజారు ఏర్పాటుకు కృషి చేయాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడంతో రైతులు, వినియోదారులు నష్టపోతున్నారు.

నిర్మాణం మధ్యలోనే ఆగిపోయి

జి.కొండూరులో కమ్యూనిటీహాల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో రైతు బజారు ఏర్పాటుకు 2018 డిసెంబరు 31న శంకుస్థాపన చేశారు. దీనికి రూ.11 లక్షలను సైతం కేటాయించారు. పనులను ప్రారంభించి రెండు గోడలైతే నిర్మించారు కానీ రైతు బజారు నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. పనులు అప్పటి నుంచి తిరిగి ప్రారంభం కాలేదు. ఇకనైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రైతు బజారు నిర్మాణాన్ని పూర్తి చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

స్థానికంగానే కూరగాయలు లభ్యం

మండల పరిధిలోని జి.కొండూరు, చెవుటూరు, గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, తెల్లదేవరపాడు, సున్నంపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు గ్రామాలలో వంద ఎకరాలకు పైగా రైతులు అన్ని రకాల కూరగాయలను సాగు చేస్తుంటారు. ఈ పంటల ఉత్పత్తుల విక్రయానికి స్థానికంగా మార్కెట్ కానీ, రైతు బజారు కానీ లేకపోవడంతో విజయవాడ తరలించి తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. ఇవే ఉత్పత్తులను స్థానిక ప్రైవేటు దుకాణాలలో అధిక ధరలు చెల్లించి వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. అదే జి.కొండూరులో రైతు బజారు ఏర్పాటు చేస్తే రైతులు నేరుగా తమ ఉత్పత్తులను విక్రయించుకోవడం వల్ల అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు జరుగుతుంది.

తరిగిపోయిన టమాటా

గత పదేళ్ల కిందటి వరకు ఉమ్మడి కృష్ణా జిల్లాలో టమాటా ఉత్పత్తిలో జి.కొండూరు మండలం ప్రథమస్థానంలో ఉండేది. ఏడాదికి రెండు వేల టన్నులకు పైగా టమాటా జి.కొండూరు మండలం నుంచి ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి అయ్యేది. పాలకులు, స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల స్థానికంగా మార్కెట్ లేకపోవడం, రైతులకు నాణ్యమైన దిగుబడులను పొందే అంశాలపై అవగాహన కల్పించకపోవడం, టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై నిర్లక్ష్యం వహించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయి టమాటా సాగు చేసేందుకు వెనకాడారు. ఇప్పుడు రైతు బజారునైనా త్వరితగతిన ఏర్పాటు చేస్తే కూరగాయల సాగు ఊపందుకుంటుందని, లేకుంటే కూరగాయల సాగుపై కూడా రైతులు పునరాలోచించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతు బజారు నిర్మాణం పూర్తిచేయాలి



జి.కొండూరులో రైతు బజారు ఏర్పాటు చేయాలి. నిర్మాణ పనులను మొదలు పెట్టి మధ్యలోనే ఆపేశారు. రైతు బజారు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తే రైతులకు, స్థానిక ప్రజలకు మేలు జరుగుతుంది.

– పజ్జూరు కిశోర్, గ్రామస్తుడు, జి.కొండూరు

అధిక ధరలకు కొంటున్నాం



స్థానికంగా రైతులు పండించిన కూరగాయాలను విజయవాడ తరలించి తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మరలా అవే కూరగాయలను వ్యాపారులు తీసుకొచ్చి ప్రజలకు ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. రైతు బజారు ఉంటే నేరుగా రైతులే ప్రజలకు తమ ఉత్పత్తులను విక్రయిస్తారు.

– హేమానాయక్, రైతు, గడ్డమణుగు గ్రామం

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ వెలగలేరు అధ్యక్షుడిగా సుకుంద్



జి.కొండూరు: వైఎస్సార్ సీపీ వెలగలేరు గ్రామ అధ్యక్షుడిగా యర్రగుంట సుకుంద్ నియమితులయ్యారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జోగి రమేష్ ఆదేశాలతో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జడ రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి వెలగలేరు గ్రామంలో నిర్వహించిన గ్రామ పార్టీ సమావేశంలో సుకుంద్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు, కేడీసీసీ మాజీ వైస్ చైర్మెన్ వేములకొండ రాంబాబు, సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల రక్షణకు కృషి

తిరువూరు: సామాజిక అసమానతలను తొలగించి వ్యక్తి స్వేచ్ఛను కాపాడేందుకు మానవ హక్కుల కౌన్సిల్ కృషి చేస్తోందని జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ ఉపాధ్యక్షుడు గంజా కృష్ణమోహన్ అన్నారు. ఇటీవల జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కృష్ణమోహన్‌కు స్థానిక రాజీవ్ భవన్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మానవ హక్కుల పరిరక్షణే కీలకంగా మారిందని, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో మానవహక్కులు హరించే విధంగా పాలకులు నిర్ణయాలు తీసుకుంటున్నారని కృష్ణమోహన్ తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాస్, స్థానిక నాయకులు ఉప్పలపాటి లక్ష్మీదాసు, యడ్లపల్లి రామకృష్ణ, బొడ్డు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి మేట్ల మాయాజాలం

పనులకు రాని వారికి కూడా మస్టర్లు

మైలవరం: మైలవరం మండలం గణపవరం గ్రామంలోని తూర్పు చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనుల మస్టర్లలో అవినీతి చోటుచేసుకుందని కూలీలు ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీ పనులకు హాజరుకాని వారి పేర్లు ఎక్కువగా నమోదు చేస్తున్నారని, ఎన్ఎంఎంని వేసే ముందు కొంత మంది వచ్చి ఫొటో దిగి వెళ్లేవారి సంఖ్యతో పాటు మస్టర్ వేతనం కొరకు నమోదు చేసిన పేర్లు ఎక్కువగా కన్పిస్తున్నాయి. చెరువులో పూడికతీత పనులకు స్థానికులకు కూలీ పనిదినాలు కల్పిస్తూ వేతనాలు చెల్లించాల్సి ఉండగా యంత్రాలను కూడా ఉపయోగించి పనులు చేయిస్తూ కూలీలకు వేతనాలు చెల్లిస్తున్నట్లు రాసుకుంటున్నారు. గణపవరం తూర్పు చెరువులో జరుగుతున్న పూడికతీత పనుల్లో గ్రామానికి చెందిన కందుల వెంకట్రావమ్మ పనికి రాకపోయినా వచ్చినట్లు మస్టరు వేసి ఉంది. దీనిపై సీనియర్ మేట్ రాజాను వివరణ కోరగా వెంకట్రావమ్మ బాగోలేక ఈ రోజు రాలేదని చెప్పారు. అలాగే నంబూరు శేషయ్య, ఎన్. కిశోర్‌తో పాటు మరి కొంతమంది పనికి రాకపోయినా మస్టర్‌లో వస్తున్నట్లు చూపిస్తూ మేట్‌లు మాయాజాలం చేస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 7 వరకు ఉపాధి పనికి హాజరుకాని వారు 20 మంది పేర్లు నమోదు చేయడం గమనార్హం. మరో గ్రూపు నంబూరు వెంకటేశ్వరమ్మ గ్రూపులో 20 మంది పేర్లతో మస్టర్ వేశారు. గణపవరం గ్రామంలో మొత్తం 1,300 జాబ్ కార్డులు ఉండగా 400 మంది మాత్రమే పనికి రావడం గమనార్హం. ఈ పనులు నిర్వహణ మొత్తం టీడీపీ నేత ఆధ్వర్యంలో జరుగుతుండటం గమనార్హం.

త్యాగానికి ప్రతీక బక్రీద్



మైలవరం ఈద్గాలో ప్రార్థనలు



తిరువూరు ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మైలవరం: త్యాగానికి ప్రతి రూపమే బక్రీద్ పండుగ అని ముస్లిం మత గురువు షేక్ వాహెద్ అన్నారు. మైలవరం నూజివీడు పాత రోడ్డులోని ఈద్గాలో బక్రీద్ సందర్భంగా నిర్వహించిన నమాజులో ఆయన ప్రసంగించారు. మహ్మద్ ప్రవక్త బోధించిన సమైక్యత, సోదర భావాన్ని ప్రతిఒక్కరూ అనుసరించాలని, తనకున్న దానిలోనే తోటి వారికి కొంత సహాయం చేయాలని చెప్పారు. దైవానికి ప్రీతిపాత్రుడవు కావాలంటే త్యాగమే ఉత్తమ మార్గమని బక్రీద్ బోధిస్తోందన్నారు. ఇబ్రహీం అసమాన త్యాగానికి ప్రతీక ఈ బక్రీద్ పండుగ అన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

తిరువూరు: బక్రీద్ పండుగ సందర్భంగా తిరువూరు పట్టణంలోని మసీదులలో శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక జామియా మసీదు, బిలాల్ మసీదు, కౌసర్ మసీదు, రాజుపేటలో, మల్లమ్మ చెరువు సమీపంలోని ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విస్సన్నపేట: బక్రీదు పండుగను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక జామియా మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. త్యాగానికి, విశ్వాసానికి, ఐకతకు ప్రతీకగా బక్రీదు పండుగ అని ముస్లిం మత పెద్దలు పేర్కొన్నారు.

ఆగిరిపల్లి: బక్రీద్ సందర్భంగా స్థానిక మక్కా మసీదులో ముస్లింలు నమాజ్ చేశారు. ఈద్గాలో మత గురువు ముకరం హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి బక్రీద్ సందేశాన్ని ఇచ్చారు.

నూజివీడు: పట్టణంలోని మైలవరం రోడ్డులో ఉన్న ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మసీదులు, దర్గాల వద్ద ఉదయం నుంచే ప్రార్థనలు జరిగాయి.

మహిళా సాధికారతకు పోరాటం

మైలవరం: మహిళల పాత్ర లేకుండా సమాజం మనుగడ అసాధ్యమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య 71వ వార్షికోత్సవం మైలవరం మండలం పోరాట నగర్‌లో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లుగా మహిళల హక్కుల కోసం నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలను వివరించారు. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ దుర్గాకోటేశ్వరమ్మ మాట్లాడుతూ మహిళా సాధికారత, అన్నింటా సమాన హక్కులు, అన్ని రంగాల్లో రిజర్వేషన్‌లు, సమాన పనికి సమాన వేతనం, మహిళల పట్ల సమాజంలో జరుగుతున్న వివక్షతలు, అక్రమాలు, అఘాయిత్యాలుపై మహిళా సమాఖ్య చేసిన ఉద్యమాలు వివరించారు. మైలవరం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కారుమూరి రత్నకుమారి, బసవాని కుమారి, భూక్యా బుజ్జి, ప్రత్తిపాటి రాణి, దేశావతు రాణి, అజ్మీరా కోమటి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో రేషన్ పంపిణీకి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఇబ్రహీంపట్నం: కాచవరం ఇందిరమ్మ కాలనీలో రేషన్ బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 'మూడు కి.మీ. వెళితేనే రేషన్' పేరుతో సాక్షిలో శనివారం కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారి తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు ద్వారా కాలనీలో రేషన్ పంపిణీపై సర్వే చేయించారు. ఇందిరమ్మ కాలనీలో సుమారు 300, సత్యనారాయణపురంలో 80 కుటుంబాలు ఉన్నట్లు గుర్తించారు. వీరు సుమారు 1.8 కిలో మీటర్ల దూరంలో ఉన్న డీలర్ వద్ద సరుకులు తెచ్చుకుంటున్నట్లు గుర్తించారు. రానుపోను మూడు కిలోమీటర్లకు పైగా ఉంది. గతంలో ఈ ప్రాంతంలో రేషన్ దుకాణం ఏర్పాటుకు చర్యలు తీసుకోగా అనివార్యకారణాలతో నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం 27వ నంబర్ రేషన్ డీలర్ ద్వారానే కాలనీలో నెలలో ఐదు రోజులు బియ్యం పంపిణీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కొత్తూరు చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు



ట్రాక్టర్లలో చెరువు మట్టి తరలిస్తున్న దృశ్యం

- ట్రాక్టర్ మట్టికి రూ.250 వసూలు
- టీడీపీ నాయకుల బరితెగింపు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం కొత్తూరు చెరువులో గత రెండు రోజులుగా టీడీపీ నాయకులు అక్రమంగా మట్టి తవ్వుతున్నారు. ట్రాక్టర్ మట్టిని రూ.250కి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అధికారం మనదే, మనల్ని ఎవరు ఆపేదనే ధీమాతో రెండు రోజులుగా రేయింబవళ్లు మట్టి తవ్వుతున్నారు. కొత్తూరు, తాడేపల్లి, వెలగలేరు సమీప గ్రామాల్లోని పొలాలకు, ఇటుక బట్టీలకు చెరువు మట్టిని తరలిస్తున్నారు. అక్రమ మట్టి రవాణా గురించి తెలిసినా రెవెన్యూ అధికారులు కానీ, పోలీసులు కానీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొత్తూరు చెరువులో మట్టి తవ్వకాలపై ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్‌ను వివరణ కోరగా చెరువులో మట్టి తవ్వకాలకు గ్రామస్తులు దరఖాస్తు చేసుకున్నారని, అనుమతులు మంజూరు కాలేదన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



పాఠశాల విద్యకు
పెట్టింది పేరు మైలవరం



మైలవరం ఎంబీఎం గరల్స్ హైస్కూల్ భవనం



ఇంటర్ హైస్కూల్ ప్లస్‌లో రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిన బూక్యా హరిణిని అభినందిస్తున్న తల్లిదండ్రులు

జి.కొండూరు: పాఠశాల విద్యకు మైలవరం నియోజకవర్గం కంచుకోటగా మారుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు పోటీ పడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఈ ప్రాంత విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం, విజయవాడ రూరల్ మండలాల్లో ప్రైవేటు పాఠశాలలు పేద విద్యార్థులు చదువుకునే స్థాయి నుంచి లక్షలు వెచ్చించే శక్తి ఉన్న పిల్లలు చదువుకునే స్థాయి వరకు ఇంటర్నేషనల్ పాఠశాలలు సైతం అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో ఇంటర్నేషనల్, కేంద్ర ప్రభుత్వ పాఠశాలలైన కేంద్రియ విద్యాలయాలు, సైనిక్ పాఠశాలలు సైతం అందుబాటులో ఉన్నాయి. పాఠశాల విద్య కోసమే తల్లిదండ్రులకు దూరంగా వసతిగృహాల్లో ఉండి చదువుకునే స్థాయి నుంచి నియోజకవర్గంలోనే అన్ని వర్గాలకు అనుకూలమైన పాఠశాలలు అందుబాటులోకి రావడంతో నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందులు తప్పాయి.



ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని కేంద్రియ విద్యాలయ భవనం

జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచి..

మైలవరం నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన పలువురు విద్యార్థులు జిల్లాలోనే ప్రథమస్థానంలో నిలుస్తూ నియోజకవర్గానికి పేరు తీసుకొస్తున్నారు. అదే స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలు సైతం పోటీ పడుతున్నాయి. మైలవరం ఎంబీఎం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ నుంచి ఇంటర్ విద్యార్థిని బూక్యా హరిణి 978 మార్కులు సాధించి రాష్ట్రంలో ఉన్న 294 హైస్కూల్ ప్లస్‌లలో ప్రథమస్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన పటాన్ సాజిదా కాతూన్ అనే విద్యార్థిని 976 మార్కులతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన పసుపులేటి నందిని పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. కనిమెర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న అన్నా చెల్లెళ్లు బి. రేవంత్‌కుమార్, సింధులు ఇంగ్లిషు వర్డ్ చాంపియన్ షిప్ పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రానికి గుర్తింపు తెచ్చారు. ఈ విధంగా మైలవరం నియోజకవర్గం పాఠశాల విద్యలో దూసుకుపోతోంది.



జాతీయ ఇంగ్లిష్ వర్డ్ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపిన కనిమెర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు